## క్లుప్తంగా

### హనుమాన్ చాలీసా పారాయణం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు గాంధీనగర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. ప్రతివారం సాయంత్రం 6గంటల నుంచి 7.30గంటల వరకు పారాయణం చేస్తామని ఆలయ భక్తబృందం తెలియజేశారు. ఆసక్తి ఉన్న భక్తులు ప్రతి మంగళవారం సాయంత్రం పారాయణానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. పారాయణం సందర్భంగా పంచముఖ ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఘనంగా శివపార్వతుల కల్యాణం



బాలానగర్: ఉడిత్యాలలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఉమామహేశ్వర ఆలయ ప్రాంగణంలో శివాంజనేయ భక్త బృందం ఆధ్వర్యంలో వేడుకను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. మహోత్సవం అనంతరం భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటుచేశారు. కల్యాణోత్సవానికి తోడ్పాటు అందించిన భక్తులను, గ్రామ పెద్దలను భక్తబృందం సభ్యులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ప్రదీప్ గౌడ్, మాజీసర్పంచ్ మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### 'బీఆర్‌ఎస్‌కే ఎక్కువ ఓట్లు'

జడ్చర్ల టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటువేసిన ప్రతిఒక్కరికీ జెడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య మంగళవారం ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ బీఆర్‌ఎస్ పార్టీకి అనుకూలంగా సైలెంట్ ఓటింగ్ జరిగిందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల కన్నా ఎక్కువ ఓట్లు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

### జోరుగా ఇసుక దందా

మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. కొందరు అక్రమార్కులు వర్కూర్‌వాగు నుంచి మక్తల్ మండలం దాసర్‌పల్లి గ్రామానికి చెందిన కొందరు నిత్యం ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. మాగనూర్ మండల పెద్దవాగు పరివాహక గ్రామాల్లో దందా కొనసాగుతున్న.. స్థానిక అధికారులు చూసిచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. మండలం నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుక తరలుతున్న అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి మండలంలోని ఆయా గ్రామాల్లో సాగుతున్న ఇసుక అక్రమ దందాపై ఉక్కుపాదం మోపాలని సమీప పొలాల రైతులు కోరుతున్నారు.

### కరపత్రాలు విడుదల



ఊట్కూరు: మండలంలోని ఎల్‌బీనగర్ పడమటి ఆంజనేయస్వామి జాతర ఉత్సవాల కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 22న స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం, అన్నదాన కార్యక్రమం, ఈ నెల 23న గ్రామ పురవీధుల గుండా కలశ ఊరేగింపు , సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్, వెంకటప్ప, నాగేష్, వెంకటేష్‌గౌడ్, చిన్న హన్మంతు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న ఆర్‌యూబీల నిర్మాణం



డిగ్రీ కళాశాలవైపు పూర్తయిన ఆర్‌యూబీ



సర్వీస్‌రోడ్డు మెయింటెనెన్స్ వాల్



హైస్కూల్‌వైపు నిర్మాణంలో ఉన్న ఆర్‌యూబీ



హైస్కూల్ వైపు సర్వీస్‌రోడ్డుకు మెయింటెనెన్స్ వాల్

జడ్చర్ల టౌన్: రాయచూర్ నుంచి కోదాడ వరకు ఉన్న 167వ నంబరు జాతీయరహదారిపై మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్‌గడ్డపై విస్తరణ పనుల్లో భాగంగా ఆర్‌యూబీల నిర్మాణాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా ప్రస్తుత రైల్వేబ్రిడ్జ్‌కు ఇరువైపులా రెండు ఆర్‌యూబీలు నిర్మాణం చేస్తున్నారు. వీటికి అనుబంధంగా సర్వీస్‌రోడ్లు సైతం చేపట్టారు. ఇప్పటికే డిగ్రీ కళాశాల వైపు ఒక ఆర్‌యూబీ నిర్మాణం పూర్తయ్యింది. దీనికి అనుబంధంగా సర్వీస్‌రోడ్డు మెయింటెనెన్స్ వాల్ సైతం పూర్తిచేస్తున్నారు. ఆర్‌యూబీ ద్వారా డిగ్రీకళాశాల విద్యార్థులు, ఆయా కాలనీవాసులు జాతీయరహదారి దాటేందుకు సులువవుతుంది. అలాగే హైస్కూల్ వైపు ఆర్‌యూబీ నిర్మాణం పనులు ఊపందుకున్నాయి. ఇక్కడ సర్వీస్‌రోడ్డుకు సంబంధించిన మెయింటెనెన్స్ వాల్ పనులు కొనసాగుతున్నాయి. ఈ సర్వీస్‌రోడ్డు గుండా హైస్కూల్ విద్యార్థుల తోపాటు శ్రీనివాస్‌నగర్ కాలనీవాసులు సులువుగా జాతీయరహదారి దాటి అవతలివైపు ప్రయాణించే అవకాశం కలుగుతుంది.

### ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలి

మిడ్జిల్: నారాయణఖేడ్ ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందిపై, పోలీసులతో లాఠీ చార్జ్ చేయించిన ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. నర్సింహులు డిమాండ్ చేశారు. ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని.. లాఠీచార్జ్ చేయించడాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మహబూబ్‌నగర్ కమిటీ నుంచి తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త గొల్లరాజు హఠాన్మరణం చెందిన నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. రాజు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహయాదవ్, భాస్కర్‌గౌడ్, కొండయ్య, వెంకటాంపల్లి రాజు, శరత్‌గౌడ్, చంద్రయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో జములమ్మకు పూజలు



జములమ్మ ఆలయం చెంత భక్తుల సందడి

చిన్నచింతకుంట: తిరుమలాపురం సమీపంలో వెలసిన జములమ్మ గ్రామ దేవతకు మంగళవారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. తిరుమలాపురంతోపాటు దాసర్‌పల్లి, గూడూర్ గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఏటా వర్షకాలం పంటలు సాగు చేసే ముందు ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఇక్కడి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠ వార్షికోత్సవం



జడ్చర్లలో పూజలు చేస్తున్న భక్తులు



బల్సుపల్లిలో..

జడ్చర్ల టౌన్: పట్టణంలో బొడ్రాయి ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవ మంగళవారం ఘనంగా నిర్వహించారు. మారుతి భజన మండలి ఆధ్వర్యంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మహిళలు బోనాలతో ఇళ్ల నుంచి బయలుదేరి ఊరేగింపుగా బొడ్రాయి వద్దకు చేరుకుని నైవేద్యాలు సమర్పించారు. బొడ్రాయి చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో కొంగళి మోహన్‌రాజు, శ్రీకాంత్, తప్పెటి జంగయ్య, శాగ గోపాల్, రాంచంద్రయ్య, శ్రీనివాసులు, ఆంజనేయులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**బల్సుపల్లిలో..**

దేవరకద్ర: మండలపరిధిలోని బల్సుపల్లి గ్రామంలో మంగళవారం ఘనంగా బొడ్రాయి, బోనాల పండుగ ఉత్సవాలు జరిగాయి. గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ దేవాలయం, బొడ్రాయి ప్రతిష్ఠ జరిగి మూడు సంవత్సరాలు అయిన సందర్భంగా గ్రామస్తులు ఈ ఉత్సవాలను నిర్వహించారు. పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సాయంత్రం బోనాల ఉత్సవం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సరోజ, నాయకులు శంకర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్: మండల పరిధిలోని రాయపల్లి గ్రామంలో మంగళవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వేదపండితులు బొడ్రాయి, కోటమైసమ్మ, పోతురాజు విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సుందరంగా తయారు చేసిన బోనాలతో గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం బొడ్రాయికి బోనాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ కిష్టారం మల్లేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ గంగాధర్‌గౌడ్, నాయకులు రాంరెడ్డి, ప్రవీణ్, నవీన్, మహేష్‌గౌడ్, అశోక్, రాములు ఆచారి, మణిశంకర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ భవన నిర్మాణమెప్పుడో?



ఆగిపోయిన పంచాయతీ భవన నిర్మాణం

గండీడ్: మండలపరిధిలో పలు పంచాయతీ భవనాల నిర్మాణాలకు మోక్షం కలగడం లేదు. పనులు ప్రారంభమైనప్పటికీ నిర్మాణానికి పలు రకాల అడ్డంకులు ఎదురు కావడంతో ఎక్కడిక్కడే ఆగిపోయాయి. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో... 2018లో పాలనలో పారదర్శకత ఉండాలన్న ధ్యేయంతో తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. 500 జనాభా కంటే ఎక్కువ ఉన్నవాటిని గుర్తించి గత పంచాయతీ ఎన్నికల కంటే ముందే కొత్త వాటికి శ్రీకారం చుట్టారు. ఒకవేళ తండా జనాభా సరిపోకపోతే పక్కన ఉన్న ఇతర వాటిని సైతం కలుపుకొన్నారు. ఇందులో భాగంగానే మండల పరిధిలోని గండీడ్ అనుబంధ గ్రామాలుగా ఉన్న చెన్నాయిపల్లి, పూలపల్లి, మాలగుడిసెలు తదితర వాటిని కలిపి చెన్నాయిపల్లి తండాను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేశారు. కాగా కొత్త పంచాయతీ భవనం లేకపోవడంతో అప్పట్లో తాత్కాలికంగా తండాలోని ఓ పాఠశాల భవనాన్నీ ఉపయోగించుకున్నారు. కాగా గతేడాది కొత్త పంచాయతీలకు పక్కా భవనాలు మంజూరు అయ్యాయి. అందులో భాగంగా మండలానికి 14 పక్కా భవనాలు మంజూరు చేశారు. వాటిలో చెన్నాయిపల్లి తండా కూడా ఉంది. అయితే మొదట్లో అనువైన స్థలం దొరకలేదని పనులు ముందుకు సాగలేదు. దీంతో ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉంచారు. కాగా పూలపల్లి వద్ద అయితే అందరికీ అనుకూలంగా ఉంటుందని ప్రారంభానికి సంకల్పించారు. అప్పటి ఎమ్మెల్యే చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. తీరా పనులు ప్రారంభించేందుకు గుంతలు తీస్తుండగా తండావాసులు అడ్డుకున్నారు. భవనాన్ని పూలపల్లిలో ఎలా నిర్మిస్తారంటూ అధికారులు, అప్పటి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయన రాజీ కుదర్చడానికి ప్రయత్నం చేసినా ఫలించలేదు. కాగా ఎట్టి పరిస్థితుల్లో తండాలోనే నిర్మించాలని గిరిజనులు పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలోనే త్వరగా పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

**అందరి సూచన మేరకే..**

మొదట తండాలోనే పంచాయతీ భవనాన్ని నిర్మించాలని.. స్థలం గురించి తండాలో పలువురిని అడిగాం. ఎక్కడ లేదని చెప్పారు. ఈ విషయాన్ని అప్పటి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. తండావాసులతో ఆయన మాట్లాడారు. ఎక్కడా స్థలం దొరకక పూలపల్లి వద్ద స్థలం ఇవ్వడానికి ముందుకు రావడంతో ఆయనకు వివరించి శంకుస్థాపన చేయించాం. గుంతలు తవ్వేటప్పుడు తండావాసులు అడ్డుకున్నారు. అందరిని సంప్రదించి చేపట్టాక పనులు ఆపడం సమంజసం కాదు.

– గిరమోని వెంకటయ్య, చెన్నాయిపల్లి

**తండాలోనే నిర్మించాలి..**

ఇప్పటికే గిరిజన తండాల్లో అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. కనీసం గ్రామపంచాయతీలుగా ఏర్పడ్డాక అయినా మెరుగవుతాయని ఆశిస్తున్నాం. తండాలకు వచ్చిన నిధులు తండాల అభివృద్ధికే కేటాయించాలి. చెన్నాయిపల్లి తండా పేరుమీద మంజూరయిన పంచాయతీ భవనాన్ని ఇక్కడే నిర్మించడం సబబు. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చేపట్టాలి.

– దశరథ్ నాయక్, చెన్నాయిపల్లి తండా

### కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు




మరికల్: మండల కేంద్రంలోని శ్రీవాణి పాఠశాల ఆవరణలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. మంగళవారం చిన్నారి విద్యార్థులుకు యోగా చేయడంతో కలిగే ఆరోగ్య ఫలితాలపై నిర్వాహకులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లశర్మ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ యోగా చేస్తే భవిష్యత్‌లో మంచి ఆరోగ్యం పొందొచ్చని సూచించారు. ఈ వేసవి యోగా తరగతులను పాఠశాలలు పునఃప్రారంభం వరకు నిర్వహిస్తామన్నారు.

### భూ సార పరీక్షలు నిర్వహించాలి

మరికల్: వానాకాలంలో పంటలు సాగు చేసే ముందు వ్యవసాయశాఖ అధికారులు మట్టి పరీక్షలు నిర్వహించాలని రైతు సంఘం నాయకులు పద్మనాభం రెడ్డి, రాములు అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ భూ పరీక్షలు నిర్వహిస్తేనే భూమిలో ఏ పంట సాగుచేయాలనే విషయం తెలుస్తుందన్నారు. ప్రతి రైతుకు చెందిన భూములను అధికారులు పరీక్షలు చేసి ఏ పంటలు సాగు చేయాలో రైతులకు సూచించాలని తెలిపారు. తద్వారా వారికి మేలు జరిగే అవకాశం ఉటుందన్నారు. లేకుంటే వేసిన పంటలు పండకా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

### రోడ్డును కమ్మేసిన కంపచెట్లు



మాగనూర్: మండలంలోని వర్కూర్, నేరడగం, ఉజ్జెల్లి గ్రామాలకు వెళ్లేరోడ్డు కంపచెట్లతో కమ్మేసి అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ఈ రోడ్డు వెంట ప్రయాణించే ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు పెరిగిపోయి రోడ్డును పూర్తిగా కమ్మేశాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు అతి సమీపంలోకి వచ్చే వరకు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్కూర్ నుంచి ఉజ్జెల్లి వరకు కంపచెట్లు కమ్మేయడంతో రోడ్డు మలుపు వద్ద వాహనదారులు ఎదురెదురుగా వచ్చినప్పుడు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డుకు ఇరువైపుల పెరిగిన కంపచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

## గెలుపోటములపై చర్చోపచర్చలు



కోయిల్‌కొండలో ఎన్నికలపై చర్చిస్తున్న నాయకులు

కోయిల్‌కొండ: మండలంలో పార్లమెంటు అభ్యర్థుల గెలుపు ఓటముల అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఏ నలుగురు కలిసినా రాజకీయ చర్చే కొనసాగుతోంది. గతంలోకి భిన్నంగా ఈసారి ప్రజాతీర్పు ఉంటుందని, ప్రజలు మార్పుకోరుకుంటున్నారని ప్రచారం సాగింది. కాగా ఎవరికి వారే తమ పార్టీ గెలుస్తుందంటే తమ పార్టీ గెలుస్తుందంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే ముఖ్యంగా ఈసారి కాంగ్రెస్, బీజేపీల మధ్యే ప్రధానంగా పోటీ నెలకొందని పలువురు భావిస్తున్నారు. సీఎం రేవంత్ వర్సెస్, ప్రధాని మోదీ అన్నట్లుగా పోలింగ్ సాగిందని అభిప్రాయపడుతున్నారు. ఇదే విషయంపై మంగళవారం వివిధ పార్టీల నాయకులు ప్రత్యేకంగా చర్యలు జరిపారు. ఇదిలా ఉండగా మండలంలో పోలింగ్ శాతం పెంచేందుకోసం అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా అంతగా ఫలితాలు ఇవ్వాలేదు. పైగా తగ్గిపోయింది. మొత్తంగా మండలంలో 69.8 శాతంగా పోలింగ్ నమోదైందని లెక్కలు చెబుతున్నాయి.

**ఎవరి లెక్కలు వారివే..**

నవాబుపేట: మండలపరిధిలో పోలింగ్ సరళి భాగానే కనిపించినా ఓట్లు మాత్రం ఎవరికీ ఎక్కువగా పడ్డాయోననేది మాత్రం సస్పెన్స్‌గా మారింది. 'మీ ఊరిలో గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా మనకు లీడ్ వస్తుందంటావా' అంటూ నాయకులు ఆరా తీస్తున్నారు. కాగా క్యాడర్ లేని ఓ పార్టీకి ఓ గ్రామంలో మెజార్టీ వస్తుందని ఓటర్ నాడే చెప్పడంతో వివిధ పార్టీల నాయకులంతా అవాక్కై తమ పార్టీల నేతలతో పోలింగ్ కేంద్రాల వారీగా లెక్కలు వేస్తూ అంచనాలను సిద్ధం చేస్తున్నారు. ఇన్ని రోజులు ఆయా గ్రామాల్లో తమకు పట్టు ఉందని చెప్పుకున్న నాయకులు.. పోలింగ్ సరళితో వారి అంచనాలు తలకిందులు అయ్యాయన్న ఆందోళనలో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా నాయకుల అంచనాలు తేటతెల్లం కావాలంటే జూన్ 4 వరకు చూడాల్సిందే.



పూలమాలలు వేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

## భగీరథుడి స్ఫూర్తితో ముందుకు సాగాలి




భగీరథుడి చిత్రపటం వద్ద బీసీ సమాజ్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సగర భగీరథ మహర్షి మహా జ్ఞాని, పరోపకారానికి పెట్టింది పేరు అని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్ అన్నారు. భగీరథ మహర్షి జయంతి సందర్భంగా మంగళవారం స్థానికంగా ఆ సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఎవరైనా కఠోర శ్రమ చేసి దేనినైనా సాధిస్తే భగీరథ ప్రయత్నమని చెప్పుకోవడం దానికి ప్రత్యక్ష దైవంగా భగీరథుడు ఎంతో కష్టపడి దివి నుంచి గంగను భూమికి తీసుకొచ్చాడని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్లు సత్యం, శేఖర్, జాండ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, లక్ష్మీకాంత్, శ్రీనివాసులు, డీకే నాయి, బుగ్గన్న, గంజి ఆంజనేయులు, రజక రిజర్వేషన్ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శివన్న, భాస్కర్, మల్లేష్, రాజు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక పద్మావతీకాలనీలోని ఆయన విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**విగ్రహాల ఏర్పాటు కొనసాగించాలి**

తెలంగాణ వచ్చాక తమ హయాంలోనే భగీరథ మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నామని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక పద్మావతికాలనీలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారుఏ. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో వివిధ సామాజిక వర్గాల ఆత్మగౌరవ భవనాలు, విగ్రహాల ఏర్పాటును కొనసాగించాలని కోరారు. బీఆర్‌ఎస్ హయాంలో మంజూరైన వాటిని పూర్తి చేసేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ తాటి గణేష్‌కుమార్, ప్రణీల్‌చందర్, ఏడోవార్డు కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో భగీరథ మహర్షికి పూలమాలలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్



పేరూర్‌లో..

దేవరకద్ర: కౌకుంట్ల మండలం పేరూర్ గ్రామంలో మంగళవారం ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. భగీరథుడి స్ఫూర్తితో ముందుకు సాగాలని ఈ సందర్భంగా నాయకులు అన్నారు. గ్రామంలోని సగర సంఘం కార్యాలయంలో భగీరథుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సగర సంఘం నాయకులు రాంచంద్రయ్య, ఆర్‌సీ శ్రీనివాసులు, ఆంజనేయులు, ఆర్‌బీ శ్రీనివాసులు, గౌని వెంకటయ్య, మేగనాథ్, కృష్ణయ్య, రవిసాగర్, అరుణ్, సాయికుమార్ పాల్గొన్నారు.